ఎత్తు ఆ కొండల పొత్తు. ఒత్తు ఆ అడవుల పొత్తు. కొత్త ఆ ఫియట్ పొత్తు. మరి, మరి, మత్తు కళ్ళు. . .ఆ. . .ఆ మగువ పొత్తు!


పాపి కొండల వైపుగా, మారేడుమిల్లికి పదిహేను మైళ్ళ దూరంలో ఎత్తయిన కొండల మధ్య ఇప్ప, టేకు, వెదురు చెట్లున్న ఆ రెండొందల ఎకరాల లోయలో అగ్ని వర్షం కురిపిస్తున్నట్లు, పూలు రాలుస్తున్న కణిమి చెట్టు కిందికొచ్చి ఆగింది జీపు. రెండు పొడవాటి ఆస్బెస్టాస్ షెడ్లూ, ఒక డజను కాన్వాసు గుడారాలూ ఆ చెట్టు చుట్టూ ఉన్నాయి.

జీపాగిన నాలుగు క్షణాల తర్వాత ఆ ఫియట్ కారొచ్చి దాని పక్కనే ఆగింది.

జీపులోంచి దిగిన బుజారాయ్, కార్లోంచి దిగుతున్న ఆ ముప్పయ్యేళ్ళ మత్తు కళ్ళ మెరుపు తీగన్ని చూశాడు. చూస్తూనే అతని కళ్ళు ఆమె ఒంటికి అతుక్కుపోయాయి. అంతకుముందే స్లీవ్‌లెస్ బ్లవుజ్, పీ క్రూ చీర, బన్ను ముడి, మెరిసే సెంటు లతుక్కుపోయిన ఆ దంతపు రంగు శరీరానికి బుజారాయ్ చూపులు కూడా అతుక్కుపోవటంతో ఆశ్చర్యం లేదేమో!

“మిస్టర్ బుజారాయ్! మీ అవ్వకాల స్థలం భూస్వామి మిస్టర్ భూపతిరాజాను కలుస్తారా!” అన్నాడు అంతకుముందే జీపులో నుంచి దిగుతున్న జిల్లా కలెక్టరు. సంభాషణంతా ఇంగ్లీషులో సాగింది. ఆ ప్రాంతపు తాలూకు అధికారులు తెలుగు రాని ఉత్తరాధికారులు.

బుజారాయ్ తల్లిపడ్డాడు. కారుకు అవతలి వైపు నుంచి దిగి చుట్టూ తిరిగొచ్చిన భూపతి రాజా బుజారాయ్‌కి నమస్కారం చేసి, తనపక్క కొచ్చిన ఆ మెరుపు తీగను, “నా భార్య, తిలోత్తమా దేవి!” అని పరిచయం చేశాడు. ఇంకా అన్నాడు




“మిమ్మల్ని మారేడుమిల్లి రెస్ట్ హౌస్‌లోనే కలవచ్చని కలెక్టరుగారు చెబితే అక్కడ వెయిట్ చేశాము. మీరూ, కలెక్టరుగారూ, మేధావద్‌గారూ అక్కడ ఆగుతారనుకున్నాము. కానీ, మీ జీపు సరాసరి వచ్చేసింది.”

“యస్. యస్” అన్నాడు బుజారాయ్. మేధావద్‌తో సహా అందరూ నమస్కార ప్రతి నమస్కారాలు చేసుకొన్నారు.

● ● ● ●

రాత్రి ఎనిమిదయింది.

అంతా భోజనాల బల్ల చుట్టూ కూర్చుని భోజనాలు చేస్తున్నారు. భూపతిరాజా కలెక్టరుకు ఏదో సంజ్ఞ చేశాడు. కలెక్టరు, “మీరే అడగండి” అన్నాడు.

బుజారాయ్ తలెత్తి “ఏం?” అన్నాడు.


భూపతి చేతులు నలుపుతూ అన్నాడు “మిం సర్. . .మీరు అవ్వకాలు ఉత్పత్తం చేస్తున్నారు. . భూమి రేటు తేల్చలేదు. ముందర అన్ని గట్టుల తోటి ఆ తర్వాత. . గ్రానైటు దొరకలేదని. . . భూమి మీకొద్దంటే. . .నేనే మునిగిపోవాలి?. . . ఏదో ఎకరానికో పదివేలని తేల్చేస్తే. . .”

బుజారాయ్ ఆశ్చర్యపోయాడు. “పదివేలా? అసలు అంతుదు రేటు చేస్తుందని?”

బతిమాలుతూ అన్నాడు భూపతి, “సార్! రంప చోడవరం మన్యం దొర రాంభూపతిదేవుగార్ని, ఒక విధంగా మా ముత్తాతగారని మీరు చెప్పుకోవటం కానీ, మా హయాం వచ్చేసరికి బతికి చెడిన వాళ్ళమే అయ్యాం. . .దయతో గవర్నమెంటుకు మీరు ఆ పది రేటు రికమెండ్ చేస్తే. . .”

“సారీ! ఆ రేటు నేను రికమెండ్ చెయ్యలేను. రెండేళ్ళ క్రితం మా చీఫ్ సర్వేయర్ రికమెండ్ చేసిన అయిదు వేలకంటే పైసయినా అవసరమే.





ఆస్తిగుణం ఎక్కువ, వ్రతజని తక్కువ! పారం లేని ఈ భూమికి అంతకంటే ఎక్కువ గిట్టదు''

కలెక్టరు భూపతివైపు చిరాగ్గా చూశాడు.

భోజనాలయ్యాక భార్యాభర్తల్ని తీసుకుని ఫియటూ, కలెక్టర్ని తీసుకుని జీపూ వెళ్ళి పోయాయి

● ● ● ●

మర్నాడు రాత్రి కదిమి చెట్టు కింద ఒంటరిగా కూర్చొనున్నాడు ప్రొఫెసర్ బుజారాయ్

దూరంగా ఫెన్సింగ్ అవతలికి ఫియట్ కారొచ్చి ఆగింది. తిలోత్తమాదేవి పోసు లొలికించుకుంటూ లోపలికొచ్చింది. ఆమెతోపాటు కస్తూరి సెంటు కూడా ఆ ఇద్దరికీ మధ్యకొచ్చేసింది. నమస్కార ప్రతి నమస్కారాలయ్యాయి.

మత్తుకళ్ళతో ఒత్తుగా, సోరగా చూస్తూ తియ్యగా మెత్తగా అంది, ''ఎక్స్‌క్యూజ్‌మి సర్. . కొంచెం మీతో పర్సనల్‌గా మాట్లాడాలి. . .లోపలికి . . .వెళదామా?''

బుజారాయ్ ఆమెను పరీక్షించి చూశాడు. లోపల లంగా బాడీల్లేకుండా పల్చని చీర, జాకెట్టులతో ఏమాత్రమే ఆమె వచ్చింది.

''అక్కర్లేదు, ఇక్కడే చెప్పండి!''—ఖంగున, కర్కశంగా మోగింది అతని కంఠం.

ఆమె బెదిరింది. అంది: 'క్షమించండి. నాకు మిగిలిన ఆస్తి ఈ వందెకరాలే. . . పిల్లలుగల వాళ్ళం. . . మీరు పదివేల రేటిప్పించకపోతే బతకలేం. మీ ఋణం ఉంచుకొనేవాళ్ళం కాదు...ఇది యాభై వేలు. . మీరు కోరితే. . .ఇంకా ఎంతైనా. . ఏదైనా సరే. . .సంతోషంగా. . . నో అబ్జెక్షన్. .''

ఆమె తన చేతిలోని సూట్‌కేస్ అతని కుర్చీ పక్కగా, అతని చేతికి తన చేతిని తగిలిస్తూ కింద పెట్టింది. జారిన పమిటని అలవోకగా ఓసారి సర్దుకుంది.

బుజారాయ్ మొహం కోపం కక్కింది. చిటుక్కున నుంచున్నాడు. అన్నాడు: ''నేనూ పిల్లలుగలవాడినే,

# మన్మథుని బోను

గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

తిలోత్తమగారూ! అందుకనే పాపిష్టి పనులు చెయ్యలేను!" బుజారాయ్ విసవిసా లోపలికెళ్ళిపోయాడు.

విస్మయం తర్వాత సూట్‌కేస్‌ని, తిలోత్తమని ఎక్కించుకుని భూపతి వెనక్కి మళ్ళాడు.

● ● ● ●

జియాలజిస్ట్ డాక్టర్ మేధావాద్‌నీ, కేంద్ర ప్రభుత్వ ఆర్కియాలజీ శాఖ స్పెషలాఫీసర్ బుజారాయ్‌నీ— ఆ ప్రాజెక్టు తాలూకు ప్రాజెక్టాఫీసరు లోయ లోతట్టుకు తీసికెళ్ళి పూర్వం ప్రాథమిక తవ్వకాలు జరిగిన చోట్లనూ, ఇప్పుడు సమగ్ర పరిశోధన కోసం తవ్వకాలు జరగబోతున్న చోట్లనూ చూపించాడు. బుజారాయ్ మేధావాద్‌తో "మీరు కాలిఫోర్నియా కాంగ్రెస్‌కి వెళ్ళవలసింది సెప్టెంబర్ అనుకుంటాను, కదూ?... మీరు ఇక్కడి గ్రానైట్ రాళ్ళ మీద సమగ్ర పరిశోధన మీద రిపోర్టు ఇచ్చి వెళ్ళాలి... తొమ్మిది నెలల గడువున్నట్టే" అన్నాడు. ముఖ్యమైన సూచనలిచ్చాడు. ఆ రోజే ఢిల్లీకి ప్రయాణమై రాజమండ్రికి వెళ్ళిపోయాడు.

● ● ● ●

వారం రోజులు గడిచాయి.

ఒక ఆదివారంనాడు మేధావాద్ కొనుగోళ్ళకోసం రంప చోడవరం వెళ్ళాడు. అతను తిరిగొచ్చేసరికి వాచ్‌మన్, "ఎవరో మీ స్నేహితుట, సార్! మీరు తెమ్మన్నారని ఈ క్రోటను మొక్కలు తెచ్చిచ్చారు" అంటూ ఒక పాతిక ముప్పై మొక్కలున్న కట్ట చూపించాడు.

"నేనెవర్నీ అడగలేదే... సరే, తీసుకెళ్ళి బాత్‌రూమ్ నీటి గుంట దగ్గర పడెయ్" అన్నాడు మేధావాద్.

నాలుగు మొక్కల్ని ఆఫీసు గుమ్మంలోనూ, మిగిలిన వాటిని నీటిగుంట చుట్టూను నాటాడు వాచ్‌మన్.

● ● ● ●

పది రోజులు గడిచాయి.

తవ్వకాలు సాగుతున్నాయి. మర్నాడు డైనమైటు పెట్టి పేల్చి ఇంకా లోతుకెళ్ళడానికి ప్రాజెక్టు ఆఫీసరుతో కలిసి మేధావాద్ పథకాలేస్తుండగా రాజమండ్రి కాలేజీ బాటనీ లెక్చరర్ వచ్చి, గనుల తవ్వకం చూడడం కోసం తానూ వచ్చానన్నాడు. అతనికి అంతా చూపించాక, మేధావాద్ అతన్ని ఆ రాత్రి తనకు అతిథిగా ఉండమని కోరి ఒప్పించాడు.

క్యాంప్ ఆవరణలోకి వస్తూనే ఆ లెక్చరరు దూరంగా బాత్‌రూమ్ నీటి గుంట చుట్టూ కనిపిస్తున్న గుంపు దిక్కు మొక్కల్ని చూసి 'ఈ అడవిలోకి కూడా ఈ మొక్కలొచ్చేసినయ్యా— ఎయికోర్నియా క్రాసిపెస్ — పాంటెడేరియేసి ఫామిలీ!' అన్నాడు.

"ఏం వస్తే వచ్చేమిటి?" అన్నాడు మేధావాద్.


చురుగ్గా చూశాడు లెక్చరర్. 'అంతా నష్టమే. ఈ నీటి మొక్క దుబ్బులు దోమలకు పుట్టినిల్లు. చాలా వూళ్ళల్లో మలేరియా ఫైలేరియాలు ఎక్కువ అవడానికి ఈ దుబ్బు మొక్క ఒక ముఖ్య కారణం."

"అయితే పీకేసి నాశనం చెయ్యొచ్చుగా!"

నవ్వాడు లెక్చరర్. 'అదంత సులభం కాదు, డాక్టర్! దీని విత్తనాలు నేలలో ఇరవై ఏళ్ళు జీవించుండి, అనుకూల పరిస్థితుల్లో జమ్మని మొలకెత్తుతాయి. అవి నీటి మీద తేలటమే కాదు, గాలిలో కొట్టుకుపోయి ఇతర మడుగుల్లో కూడా మొలకెత్తుతాయి. ఒక్క మొక్కని నీళ్ళలో వదిలేస్తే దాని దుబ్బుల్లో నుంచి వచ్చే కాడ ద్వారా కూడా వారానికో రెండు మూడు మొలకల్ని పుట్టిస్తూ, అది రెండు మూడు నెలల్లో ఎకరం మేరవున పరాసేస్తుంది. చేపలు బతకటం కష్టం. దీన్ని పూర్తిగా నిర్మూలించలేక చాలా దేశాలవాళ్ళు దీని ఉపయోగంకోసం వెతుకున్నారు.!"

"ఐ సీ!"

"ఇంతకీ ఈ మొక్క ఇక్కడికెట్లా వచ్చింది?...




కిందటేడాది నేను బొటానికల్ టూర్‌కొచ్చినప్పుడు ఈ ప్రాంతాల్లో ఎక్కడా లేదే!"

ఆలోచనగా మేధావాద్ అన్నాడు "ఎవరో క్రోటన్సు పంపారు. ఆ మొక్కల్లో కలిసిపోయి వచ్చుంటుందనుకుంటాను."

● ● ●

ఆ రాత్రి భోజనాల దగ్గర ఆ అడవి గురించిన ప్రసక్తి వచ్చింది.

లెక్చరర్ అన్నాడు "ఇట్లా పైకి పాపికొండల్లో పోలవరం కొద్దీ అడవి దట్టం కదా...అక్కడ మాంసాహార వృక్షాలున్నాయేమో తెలుసా మీకు?"

మేధావాద్ ఆశ్చర్యపడ్డాడు. "మాంసాహార వృక్షాలా! అసలు అట్లాంటివి ఉన్నాయని నేనెప్పుడూ వినలేదే!"

"నేను విన్నాను. దక్షిణ అమెరికాలో అమెజాన్ నదీ ప్రాంతంలో దట్టమైన చీకటి అరణ్యాల్లో ఉన్నాయట... అసలిట్లాగా కీటకాల్ని తినే మొక్కలున్నాయి గదా!"

"కీటకాల్ని తినే మొక్కలా! ఇంకా ఆశ్చర్యంగా ఉందే."

లెక్చరర్ తన భోజనం ముగించాడు. చేతులు తుడుచుకుంటూ అన్నాడు "చెప్తమంటారా! కీటకాల్ని తినే మొక్కలు రెండు రకాలు. ఒకటి తమ ఆకుల మడతల్లో కీటకాల్ని నొక్కి పట్టి చంపి తినేవి. రెండు కూజా ఆకారంలో ఉన్న తమ ఆకుల్లోకి ఏమాత్రం కదలిక లేకుండా కీటకాల్ని ఆకర్షించి చంపి తినేవి!"

"ఆకులు పురుగుల్ని చంపటమా!"


"అవును. నిజం, సార్! ఇంకా చెప్తమంటారా? ఈ మొక్కలకి ఎర్రని ఎరుపు రంగులో గుండ్రని ఆకులుంటాయి. ఆ ఆకుల పై భాగాన మంచో పెట్టిన అగ్గిపుల్లల్లాంటివన్నీ వెంట్రుకలుంటాయి. ఆ వెంట్రుకల పై చివర్లో చిన్న చిన్న బల్బులుంటాయి. ఆ ఆకుల రంగూ, ఆ బల్బులూ సూర్యకాంతిలో మెరుస్తూ సువాసన వెదజల్లుతూ కీటకాల్ని ఆకర్షిస్తాయి. కీటకం వచ్చి ఆ బల్బుల్ని తాకి వాలగానే, వాటిల్లోంచి జిగురు ద్రవం ఊరుతుంది. కీటకం ఆ బల్బులకి అంటుకుపోతుంది. తక్షణం ఆ వెంట్రుకలు ఆకు మధ్య భాగంవైపు వంగి కీటకాన్ని ఆ మధ్య భాగంలోకి నొక్కి పడతాయి. అప్పటికే ఆ మధ్య భాగంలో ఊరిన జీర్ణద్రవం కీటకం అవయవాల్ని కరిగించటం మొదలుపెడుతుంది. విచిత్రమేమిటంటే ఆ సన్నని వెంట్రుకలు వెనక్కి లేచి, మళ్ళీ లోపలికి వంగి, మళ్ళీ లేచి మళ్ళీ వంగి—ఇట్లా మూడుసార్లు చేసి కీటకాన్ని పూర్తిగా జారిపోవడానికి వీల్లేకుండా ఆకుకు అంటించేస్తాయి. ప్రధానంగా ఇదొక వెరైటీ.

"ఇంకో వెరైటీ మొక్కలకి ప్రతి ఆకూ, దాని చుట్టూ రంపం పళ్ళున్నట్లుండే అంచుతో,

తెరిచిన కజ్జికాయ పెచ్చులాగా ఉంటుంది. ఆ ఆకు కూడా తన రంగూ తన ద్రవం వాసనలతో కీటకాన్ని ఆకర్షిస్తుంది. కీటకం వచ్చి ఆ ఆకు మీద వాలగానే కజ్జికాయ చెక్కలు ముడుచుకుంటున్నట్లు, తన నిలువు ఈనె వెంబడి ఆ ఆకు టప్పున ముడుచుకుంటుంది. ఆ బంధం ఎంత గట్టిదంటే లోపలున్న కీటకం అవయవాల ఒత్తిడి ఆకుపై నుంచి పైనకు కనిపిస్తాయి కూడా!

"మూడో రకం మొక్కలో ఆకుకు కీటకం తాకగానే తివాచీలాగా ఆ ఆకు రెండు అంచులూ నిలువు ఈనె వైపుకి, లోపలికి, చటుక్కున చుట్టుకు పోతాయి. ఆకు జిగురువల్ల ఆకుకు అంటుకుపోయిన కీటకాన్ని రెండు పొరలుగా తమ మధ్యలో పెట్టి దాని అవయవాలు విరిగేట్టు నొక్కేస్తాయి.

"ఏ రకంలోనైనా కీటకం తగిలాక ఆకులో మరల యాక్షన్ సంభవించడానికి పట్టే కాలం




ఎంతో తెలుసా. . . సెకన్లో పదో వంతు!

"ఇవి పోతే ఇంకో రకముంది. ఇది నిలువున్న మంచి నీటి మడుగుల్లో పెరుగుతుంది. నీటి ఉపరితలం కింద తేలుతూంటుంది. ఇది అడ్డంగా పెరిగే కాడ. వేళ్ళుండవు. నాలుగు ఈనెలూ, ఆ ఈనెల మధ్య పారాచూట్ ఆకారంలో ఉండే ఒక తిత్తి—గా దీని ప్రతి ఆకూ చీలి ఉంటుంది. ఇట్లా కాడకు ఇటూ అటూ ఆకు లుంటాయి. ఈ కాడకు ఒక చివర పూవులు పూసే ఇంకో సన్నని కాడ పుట్టి, నీటిపైకి నిలువుగా లేచి ఉండి పువ్వులతో మనకు కనిపిస్తూ ఉంటుంది. నీళ్ళలో సంచరించే దోమలు వగైరాల కీటకాల లార్వాలూ, ఇతరాలైన చిన్న పురుగులూ ఈదుకుంటూ వచ్చి ఈ మొక్క ఆకులో భాగమైన ఒక ఈనెను తగిలినప్పుడు, ఆ ఈనెకి కొంచెం కిందగా ఉండే తిత్తి పని చేస్తుంది. ఆ తిత్తికి పై భాగాన

ఉండే చిన్న ద్వారం చటుక్కున తెరుచుకుంటుంది. తిత్తి లోపలం అంతా శూన్యప్రదేశమవుతుంది కాబట్టి అక్కడున్న నీరు చటుక్కున ఆ తిత్తిలోకి ప్రవేశిస్తుంది. ఆ నీటితోబాటే ఈ క్రిమి కూడా లోపలికి తక్షణం దూరిపోతుంది. అయితే ఈ ద్వారం కింద ఉండే వాల్వు వంటి అమరిక, లోపలున్న నీటి చుక్కనైనా సరే తప్పించుకొని బయటికి వెళ్ళిపోనీయదు. మానవుడి చేత చెయ్యబడే యాంత్రికమైన వాల్వుల్లో ఎంతో సమర్థవంతమైన వాల్వులాగా ఈ వాల్వు పనిచేస్తుంది. లోపలి కీటకం పూపిరాడక (ప్రాణుల లార్వాకు బయటి గాలి పీల్చుకునే గొట్టం ఏర్పాటు దాని శరీరంలోనే ఉంది), ఉక్కిరి బిక్కిరై చనిపోతూ ఉండగానే తిత్తిలోపలి గోడలనుంచి ఉత్పత్తయ్యే జీర్ణరసాలు దాన్ని జీర్ణం చేసేసుకుంటూంటాయి. జీర్ణమయే భాగం జీర్ణమయి ఆ గోడలచేతే పీల్చుకోబడ్డ తర్వాత అంటే—సుమారు పదిహేను ఇరవై నిమిషాల

తర్వాత ఆ తిత్తి తెరుచుకుంటుంది. లోపలి నీటిని, కీటకం తాలూకు మిగిలిన భాగాల్ని తిత్తి గోడలు బయటికి తోసేస్తాయి. గమ్మత్తేమిటంటే ఆ వాల్వు అప్పుడు వ్యతిరేకంగా ఉండిపోతుంది. ఇంతా చేసి ఆ మొక్క పొడుగు—అరంగుళం! వెడల్పు, ఆకుల్తో కలుపుకుని అంగుళంలోపే! తనకు తగిలిన కీటకాన్ని, ఈ తిత్తి, సెకన్లో యాభయ్యవ వంతులో తన ఉక్కు కౌగిట్లోకి బంధించుకుంటుందంటే మీరు నమ్మగలరా?

"ఈ మొక్కలన్నీ డ్రోసెరసె అనే కుటుంబానికి చెందినవి. మొదట చెప్పిన పెంట్రుకల రకాన్ని లాటిన్ భాషలో డ్రోసెరా రోటండి ఫోలియా అంటారు. వాలుగోడన్ని—నీళ్ళల్లో తేలేదాన్ని—ఆల్డ్రోవాండా వెసిక్యులోసా అంటారు."

నౌకరువాడు రెండు కప్పులతో కాఫీ పట్టుకొచ్చాడు. లెక్చరర్ చెప్పు ఇచ్చాడు. ఘూ, "దోమలు పెరిగాయట. ఒడోమాస్ ఇమ్మన్నారు. ప్రిఫెక్ట్స్ నరుగార్లు" అన్నాడు. మేధావర్ టేబిలు మీదున్న టిక్కెట్ల చూపించాడు. వాడు దాన్ని తీసికెళ్ళి పోయాడు.

డాక్టర్ మేధావర్ కళ్ళు ఆశ్చర్యంతో నిండు న్నాయి. పూపిరి బిగపట్టి వింటున్నవాడికి కాఫీ కప్పు కొంత టెన్షన్ తగ్గించింది. అయినా కప్పు చేతితో పట్టుకుని అన్నాడు, "అద్భుతం! ఎంతో అమాయకంగా కనిపించే ఈ సృష్టిలో ఇంతటి ఇంటలిజెంట్ వర్కింగ్ సిస్టమా!" అన్నాడు.

ఇద్దరూ కాఫీ తాగారు. కప్పులు టేబిల్ మీద పెట్టారు.

లెక్చరర్ చిరునవ్వు నవ్వాడు. మళ్ళీ అందు కున్నాడు. "అమాయకంగా కనిపించే పిచర్ ప్లాంట్, అదే, మా తెలుగులో కూజా మొక్క—గురించి చెప్పనా?. . ఇది నెపెంతెసే కుటుంబానికి చెందింది. చిన్న పొదలాగా ఉంటుంది. దీనికి ఆకులు ఎర్రగన్నేరు ఆకుల్లాగా వాటికన్నా కొంచెం చిన్న ప్రమాణంలో ఉంటాయి. కానీ ప్రతి ఆకు చివరి భాగమూ సన్నగా ఈనెలాగా సాగి ఉంటుంది. దానికంటిపెట్టుకుని, కాడలేని గంధపు గిన్నె వంటి కూజా ఒకటి వేలాడుతూంటుంది. ఆ కూజాపైన కొంచెం వాలుగా పైకి లేచి ఉంటుంది. బహుశా వర్షపు నీళ్ళు లోపలికి పడకుండానేమో! ఈ మూతనుండా మూసుకోదనుకోండి. కూజాలో ఉన్న మధువు సువాసనతోబాటు ఈ మూతకూ, కూజా పై భాగానికీ ఉండే రంగులు కీటకాన్ని ఆకర్షిస్తాయి. కీటకం వచ్చి ఆ కూజా అంచున నిలబడి లోపలి మకరందాన్ని తాగటం కోసం ప్రయత్నించి జారి లోపలికి పడిపోతుంది. ఆ అంచునుంచే లోపలికి వెళ్ళాడే సన్నని వెంట్రుకలు ఆ కీటకం పైకి ఎగిరిపోకుండా ఆపుతాయి. ఇంక ఈ కీటకం తాను అంతకుముందు మధువు అనుకుని భ్రమపడిన జీర్ణరసంలో పడి క్రమంగా జీర్ణమైపోతుంది.

"చిన్న చిన్న మార్పులతో ఈ మొక్కల్లో కూడా చాలరకాలున్నాయి. కొన్నిరకాలు పెద్దంతున చెట వాత్రింనుంచి తీగలాగా పైకి పాక్కుంటూ పోతాయి. ఆకు మొత్తమంతా కూజాలాగా మారి, మొక్క పాదట్లో నుంచి మొలిచి, నరిస చిటాయి పొట్లంలాగా కనిపించే మొక్క ఇంకో రకం. ఈ రకాన్ని సెఫెంతిన్ యూలిఫ్యులారియా అంటారు."

లెక్చరర్ ఆగాడు. మోచేయి టేబిల్ మీద ఆన్చి, అరచేతితో గడ్డం పెట్టుకుని వింటున్న మేధావర్ ఆశ్చర్యం నుంచి తేరుకోవడానికి కొన్ని క్షణాలు పట్టింది. ఉండుండి అడిగాడు. 'దీన్ని బట్టి చూస్తే కీటకాలు దొరక్కపోతే ఈ మొక్కలు చచ్చిపోతాయన్నమాట!"

"నో, నో అందువల్ల చావవు. తమకు తక్కువైన నత్రజనిలో కొంత భాగాన్ని సంపాదించుకోవటం కోసం మాత్రమే కీటకాలను ఇవి ఆకర్షిస్తాయి. చాలా ఇతర లవణాలను ఇవి భూమి నుంచే సంపాదించుకొంటాయి."

చేతితో టేబిల్ మీద గీతలు గీస్తూ కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు మేధావాద్. అడిగాడు 'మీరా రా మొక్కల్ని చూశారా?'

“చూశానండి. బొటానికల్ టూర్‌లో కలకత్తా, కొడైకెనాల్, గౌహతిల్లో చూశాను.”

“రేపు ఉదయం నాకీ అడవిలో చూపించ గలరా?”

“చెప్పలేను. ఇక్కడ మా ప్రాంతాల్లో నే నెప్పుడూ చూడలేదు. కాల్షియం ఎక్కువైతే అవి బతకవనుకుంటాను. ఈ అడవిలో కొన్ని కొన్ని భూభాగాలలో ఉంటే ఉండొచ్చు. వెతకాలి.”

“అరె, దురదృష్టం!”

ఆ తర్వాత ఆ ఇద్దరూ రాజకీయాల్లోకి దిగిపోయారు.

ఉదయాన్నే ప్రాజెక్టు కార్లో లెక్చరరు రాజమండ్రి వెళ్ళిపోయాడు.

• • •

తొమ్మిదయింది. తవ్వకాల స్థలాని కెళ్ళడానికి ప్రాజెక్టాఫీసరుతో కలిసి బయటకొచ్చిన మేధావాద్‌కు గేటు దగ్గర ఒక ఇరవై మంది గిరిజనులు వాచ్‌మన్‌తో గొడవ పడుతూండడం కనిపించింది. మేధావాద్‌ను చూసి వాళ్ళు గబగబా దూసుకొచ్చి చుట్టుముట్టారు. ప్రాజెక్టాఫీసరు వాళ్ళ మాటల్ని ఇంగ్లీషులో అనువదించి మేధావాద్‌కు చెప్పాడు.

“సోకుల వలస, వెల్లూరు, లక్ష్మణలోవ గూడాల వాళ్ళట వీళ్ళు. ఈ చుట్టు మైలు కైవారంలో ఉన్నవాళ్ళు. వాళ్ళ మంచి నీళ్ళ చెరువుల్లో విషం మొక్కలు మొలిచి దోమల్ని పుట్టిస్తున్నాయట. ఆ మొక్కలు పూర్వం ఇక్కడ లేవట. మీ గది చుట్టూ పెంచుకోవటం కోసం వాటిని తెచ్చింది మీరట. మంచి నీలం పూలు పూస్తాయని చెప్పి నెల రోజుల కిందట ఎవడో ఒకడు, మీరు పాటమన్నారని అంటూ వాటిని వాళ్ళ చెరువుల్లో పాటాడట. ఆ మొక్కలిప్పుడు వాళ్ళ చెరువులన్నీ ఆక్రమించేశాయట. దోమలు విజృంభించడానికి కారణం మీరేనంటున్నారు. మనం పని ఆపేసి వెళ్ళిపోవాలట. పూర్వమెప్పుడో తగ్గిపోయిన మలేరియా మళ్ళీ వస్తే మాత్రం సహించ లేమంటున్నారు.”

ఇంకా తికమక పడ్డాడు మేధావాద్. “రేపు మనం వెళ్ళి వాళ్ళ చెరువులు చూస్తామని చెప్పండి చేతనైనంత సహాయం చేస్తామని మాటివ్వండి. ఈ మొక్కలు వ్యాపించటానికి కారణం మనం మాత్రం కాదని చెప్పండి.”

ప్రాజెక్టాఫీసరు తెలుగులోకి అనువాదం చేసి చెప్పిన దాన్ని వాళ్ళు విన్నారు. గొణుక్కుంటూ వెళ్ళిపోయారు.

మేధావాద్ హడావుడిగా లోపలి కొచ్చాడు. జిగురు పూసిన పళ్ళాన్ని బాత్‌రూమ్ నీటిగుంట మీద విసిరి పది పన్నెండు దోమల్ని పట్టుకున్నాడు. మైక్రోస్కోపు కింద వాటిని పరిశీలించాడు.


అదిరిపోయాడు!

ముక్కుల రెక్కలో తలకిందికి పెట్టి నిట్ట నిలువుగా నుంచునున్న రెండు దోమలు! మలేరియా దోమలు! పదింటిలో రెండు!

హడావుడిగా ప్రాజెక్టాఫీసర్ని రంపచోడవరం పంపించాడు. మలేరియా నిర్మూలన డిపార్ట్‌మెంటు నుంచి సూపర్వైజర్ని రప్పించాడు. అంతా కలిసి ఆ చెరువుల దగ్గరికెళ్ళి చూశారు. గుర్రపు డెక్క విపరీతంగా వ్యాపించుంది. సూపర్వైజరు ఆ మొక్కలన్నింటినీ నీళ్ళల్లోంచి పీకించి గట్టు మీద ఎండేయించాడు. గూడాల వాళ్ళకి క్వినైన్, సింకోనా బిళ్ళలు పంచాడు.

నీళ్ళల్లో డి. డి. టి., ఫినైల్ చల్లబోతే అవి తాగేనీళ్ళు కావటంవల్ల గిరిజనులు అందుకు ఇష్టపడలేదు.

ఒకపట్టాన చావనిదికదా ఈ వాటర్ హైయాసిన్త్. దీని దుబ్బుల్లో పెరిగే దోమను నిర్మూలించటం ఎట్లా? అనుకున్నాడు మేధావాద్.




మర్నాడు నలుగురు పనివాళ్ళకు మలేరియా సోకింది. దాంతో పనివాళ్ళెవ్వరూ పన్లోకి రామన్నారు. అసిస్టెంట్లొచ్చి మేధావాద్‌తో “దోమ తగ్గేదాకా సెలవిప్పించండి” అనడిగి “సరే” అనిపించుకుని వాళ్ళ వూళ్ళకు ప్రయాణమై వెళ్ళిపోయారు.

తనకిచ్చిన గడువు లోపల తవ్వకం పని పూర్తి చెయ్యలేనేమోనన్న ఆదుర్దా, తను కారణంగా అక్కడింక ఏ గవర్నమెంటు ఉద్యోగి పని చెయ్యలేనంతగా గిరిజనులకు అనుమానం కలగటం తన మూలంగా వాళ్ళ ఆరోగ్యాలు పాడవటం వీటితో తనేదో ఒకటి చెయ్యాలనుకుంటూనే ఏం చెయ్యాలో తెలీక అయిదారు రోజులు అస్తిమితంగా గడిపాడు మేధావాద్.

• • • •

హఠాత్తుగా వచ్చిన ఆలోచన్ని ఆచరణలో పెట్టటానికి బాటనీ లెక్చరర్ను పిలుచుకు రమ్మనమని ప్రాజెక్టాఫీసర్ని రాజమండ్రి పంపాడు మేధావాద్. అతను రెండు పుస్తకాల్తో తిరిగొచ్చి లెక్చరర్ తనకు రావటానికి వీల్లేదని ఆ పుస్తకా లిచ్చి పంపాడని చెప్పాడు.

మేధావాద్ బాటనీ పుస్తకం తెరిచాడు. చదివాడు:

డ్రోసెరా రోటండి ఫోలియా: ప్రధానంగా అమెరికా మొక్క—ఇతర ఉష్ణమండలాల్లోనూ, బ్రిటన్‌లోనూ అరుదు. నేలలో ఎక్కువ కాల్షియాన్ని ఈ మొక్క భరించలేదు.

అల్డ్రోవాండా: ఆఫ్రికా, ఇండియా, జపాన్ దేశాల మొక్క—మంచినీటి మడుగుల్లో, నీటి మొక్కల మధ్య పెరుగుతుంది—కోరింత దగ్గుకు మంచి ఔషధం.

‘ఈ రెండూ డ్రోసెరాసె కుటుంబంలోని వంద రకాల్లోని—ఈ కుటుంబం మొక్కలకు జీవితకాలం రెండు మూడేళ్ళు—ఆకుకూ, కాండానికీ మధ్యనించి పూగుత్తుల కాడలు పాటొన్న విత్తనాలు, విత్తనాల ద్వారానేకాక కాండం ద్వారా కూడా వ్యాప్తి. ఆమ్ల లక్షణం కలిగుండి, నత్రజని సారమూ తక్కువగా ఉంటే నేలల్లో వీటి మనుగడ.

నెపెంతిస్ ఖాస్యలారియా: ఉష్ణమండలాల మొక్క—నెపెంతసె కుటుంబంలోని ఎనభై రకాల్లో ఇదొకటి. ఈశాన్య భారతం, ఆస్ట్రేలియా, బోర్నియో, సుమత్రాలు పుట్టిళ్ళు. నీటి అంచులూ, చెట్ల కొమ్మలూ, కుళ్ళుతున్న పచ్చి రొట్టా, దీనికి బాగా అనుకూలం. విత్తనాల ద్వారా మాత్రమే వ్యాప్తి—సముద్ర మట్టంనించి 600—700 మీటర్ల ఎత్తులో మనుగడ.

జంతువుల చర్మాన్ని చీల్చి రక్తాన్ని పీల్చలేక పువ్వుల మకరందంపై ఆధారపడి జీవించే మగ దోమలూ, మరికొన్ని ఇతర రకాల దోమలూ, చిన్న

తగలా, అడవి చీమలూ దీనికి బలి అవుతాయి.

మేధానాద్ జవాంజీ పుస్తకం తెరిచాడు. దోమ గురించి చదివాడు: మనాటేరకం చేపలూ, ఒక రకం గబ్బిలాలూ దోమ లార్వాను అరికట్ట గలవు. అయితే అవి పర్వత ప్రాంతాల్లో జీవించ లేవు. కొన్నిరకాల నీటి మొక్కలు ఎంత ఎత్తులో నైనా దోమను అరికట్టగలవు—మగదోమ నశిస్తే ఆడదోమ నశిస్తుంది.

ఈ విజ్ఞానాంశాలు అతనికి విపరీతమైన ఉత్సాహాన్నిచ్చాయి. ఆ అడవి ప్రాంతం 600 మీటర్ల ఎత్తున ఉన్నదనే విషయమూ, భూ వాతావరణ పరిస్థితులు ఆ మొక్కలు పెరుగు దలకు అనుకూలంగా ఉంటాయనే విషయమూ అతని ఉత్సాహాన్ని రెట్టించాయి.

అతను క్షణం ఆలస్యం చెయ్యలేదు. ఆపూటే కలకత్తా, గౌహతి, కొడైకెనాల్‌లలోని తన మిత్రులకూ, తన క్లాస్‌మేటూ, కొలంబో నివాసీ అయిన ప్రొఫెసర్ తిరోరత్న నాయకేకూ తన కా మొక్కల విత్తనాలు కావాలని టెలిగ్రాము లిచ్చేశాడు.

అతని తండ్రికి జబ్బుగా ఉందని టెలిగ్రాం వస్తే మేధానాద్ తక్షణం పట్నానికి బయల్దేరి వెళ్ళిపోయాడు.

• • • •

నెలన్నర గడిచాక మేధానాద్ మారేడుమిల్లికి తిరిగొచ్చి చూసేసరికి చెరువుల అంచుల వెంబడే కుళ్ళుతున్న టేకు, మర్రి ఆకుల గుట్టల్లోనూ కూజా బోను మొక్కలూ (నెపెంతిస్) చెరువుల నీళ్ళల్లో తిత్తి బోను (అక్రోవాండా) మొక్కలూ వ్యాపించున్నాయి. వెంట్రుకబోను (డ్రోసెరా) మొక్కలు మాత్రం ఎక్కువ బలంగా మొలవ లేదు. వెంట్రుకల బల్బుల్లో జిగురు అంతగా లేదు.

మేధానాద్ నీటి అంచునున్న ఒక కూజాబోను మొక్కను పరిశీలించాడు. అది ఆరంగుళాలు ఎదిగుంది. దాని కూజాలు చేతి బొటనవేలు సైజులో నేలనుంచి అన్ని దిక్కుల్లోకి వాలి ఉన్నాయి. అతను తన చూపుడువేలు ఒక కూజాలోకి గుచ్చి తీస్తూంటే అంచువెంబడి లోపలికి వాలున్న సన్నని వెంట్రుకలు తగిలాయి. వేలి చివర జిగురు అంటింది. అంతవరకూ అక్కడ పైన నిశ్శబ్దంగా తిరిగిన యానోఫిలిస్ పిల్లదోమ (మలేరియా దోమ) కూజా అంచున వాలింది. తన తొండాన్ని లోపలికి పోనిచ్చి వెతికింది. కొంచెం లోపలికి జరిగింది. మక రందం అందలేదు కాబోలు, ఇంకొంచెం లోపలికి జరిగింది. ఊహూ, ఇంకా అందలేదు. ఇంకొంచెం జరిగింది. వెంట్రుక పైభాగాన వాలుగా ఇంకొంచెం, ఇంకొంచెం, ఇంకొంచెం...టప్! ఫినిష్! పడి పోయింది లోపలికి! ఇంకో నాలుగు దోమలు ఎగురుకుంటూ వచ్చాయి. కూజాలపైన వల యాలు తిరుగుతున్నాయి.

ఇంతలో గూడెం నాయకులొచ్చారు. దోమ చాలావరకూ తగ్గిపోయిందనీ, ఇక మలేరియా భయంలేదనీ అన్నారు. మేధానాద్ గుండె ఆనం దంతో నిండిపోయింది.

వెంటనే మేధానాద్ తన బసకొచ్చాడు. శిల్పి! ఆర్థికశాఖ ప్రిన్సిపలాఫీసర్ బుజ్జారాయ్‌కి ఉత్తరం రాశాడు—

"భూపతిరాజా ప్రయోగించిన మన్మథుని బోనుకు మీరు చిక్కలేదు. అంతేకాదు! ఆ కసితో ఇక్కడి చెరువుల్లో వాటర్ హైయా సింత్‌ను అతను ప్రవేశపెట్టి, మలేరియా దోమను పెంచి గిరిజనులకు నామీద అనుమానం కలిగించాడు. ఈ బోన్నుంచి దూరంగా ఈసారి నేను తప్పుకున్నాను. ఎట్లా గంటే— మాంసాహార మొక్కల్ని చెరువుల్లో ప్రవేశ పెట్టాను. వాటి ఆకులు ఈ దోమలకు మన్మ థుని మకరందపు బోనులయ్యాయి. చాలా దోమ నశించింది. ఇప్పుడు గిరిజనుల్లో నా పట్ల గౌరవం పెరిగింది.

హైయాసింత్ పక్కన అక్రోవాండాను పెంచటం దోమ నివారణకు ఒక శాశ్వత పరి ష్కారమవుతుందేమో తెలీదు.

భయంకరమైన హైయాసింత్‌ను ఇక్కడ ప్రవేశపెట్టి తప్పించుకున్నందుకు భూపతిరాజాకు ఎలాంటి బోను ఎట్లా వెయ్యాలో జాగ్రత్తగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నా మనవి."

నెగడు మండుతోంది.

మేధానాద్, బోటనీ లెక్చరర్, ప్రాజెక్టాఫీసర్ల చేతుల్లో వెదురుగొట్టాల్లో ఉప్పు పిప్పిగా కలిపిన వెదురు బియ్యమూ, పక్కనే ఆకు మడతల్లో వేగిన ఇప్పపూవూ ఉన్నాయి.

డుడుమా, కలికం, వంకి వాద్యాల స్వరాలకి అనుగుణంగా పిల్లా పెద్దా, ఆడా మగా—అందరు గిరిజనులూ ఎవాడు వరసల్లో అర్ధ చంద్రా కారంగా చేతులు పట్టుకొని అడుగులు ముందుకూ పక్కలకూ వేస్తూ మహానందంగా నాట్యం చేస్తున్నారు. లయతోనూ, తమకం కలిపిన తెలుగుతోనూ వాళ్ళు పాట పాడుతున్నారు:

"ఓ ఓ ఓ నాయక
దోమను చంపిన నాయక
ప్రాణ భిక్షను పెట్టిన నాయక
నీ భార్యా బిడ్డలంత నాయక
చల్లంగ ఉండాలి నాయక
మా కొండల్లకోనల్ల నాయక
మారాజా నీయయ్య నాయక
మాతోటే ఉండయ్యా నాయక
వనదేవత అవయ్య నాయక
కొండా ముత్యాలమ్మ ఒనయ్య నాయక
నీకు జయమవాగుతుండాలె నాయక
నీకు జయమవాగుతుండాలె నాయక నీకు"

ఆ ఆనందోత్సవ వాతావరణం మృదు మధురంగా ఆ కొండలోయ అంతటా ప్రతిధ్వనిస్తోంది. చంద్రుడు ఒళ్ళంతా కళ్ళు చేసుకొని మరీ మరీ చూస్తున్నాడు. ❋

